# సజీవులు

## (కథానిక)

తన ఉద్యోగపు దుర్వాసన కొన్నాళ్లు పీల్చకుండా వుంటేనే గాని తన జీవిత ప్రమాణం ఎదగదనే మానసిక జబ్బుతో కృశించిన చంద్రశేఖరం సెలవు దొరికిందే తడవుగా తన భార్య, యిద్దరు పిల్లల్తో తన దేశం ప్రయాణమై రైలెక్కి కూర్చున్నాడు.

తనకు రైలు ప్రయాణ యోగం పడ్తుందో పట్టదోననే అస్థిమితావస్థలో పడిన చంద్రశేఖరం రైలు పెట్టెలోకి ఎక్కీ ఎక్కడంతోనే కిటికీ దగ్గిర కూచుని తొంగి చూస్తూ యింకా రైలు కదల్దేమనే ఆరుర్దాలో వున్న సమయంలో - తన వీపు మీద ఎవరో తట్టినట్టయింది.

స్వేచ్ఛాప్రియులైన యిద్దరు పిల్లలూ, ప్రయాణానికి బరువైన సామాన్లతోనూ, నుంచున్న చోటంతా తావెతుక్కుంటున్న చంద్రశేఖరం భార్య రాజేశ్వరి పిల్లలకన్న ముందుగా కిటికీ దగ్గిర కూచుని మెడజాపి చూస్తున్న చంద్రశేఖరాన్ని చల్లగా వీపు మీద చెయివేసి పిలిచింది.

"తెచ్చుకున్న సామాన్లు సర్దుకుంటే విశ్రాంతిగా కూచోవచ్చుగా కాస్త పిల్లల్ని కూడా కూచోపెట్టుకోండి మీ పక్కనే" అంది రాజేశ్వరి సన్నగా రైలు సందట్లో.

"అదేమిటి? యింకా కూచోలేదూ? నిక్షేపంగా యింత చోటుంది సద్దుకు కూచోండి రైలు కదలబోతున్నది" అన్నాడు చంద్రశేఖరం ప్లాట్ ఫారం దృశ్యంలో నిమగ్నుడవుతూ.

తనను అంటకుండా వొకర్నొకరు మర్యాదగా పడదోసుకుంటూ ప్లాట్ ఫారమంతా తిరుగుతున్న జన సమూహాన్ని అర్ధ నిమీలంగా పరిశీలించాడు చంద్రశేఖరం. తీరుబడికి దూరమైన యీ పట్నం జన సమూహాన్నుంచి తను కొన్నాళ్లన్నా విడిబడ్తున్నందుకు చంద్రశేఖరం మనోపక్షి ఆనందంతో రెక్కలాడించింది.

కూత కూసిన రైలు దొర్లుకుంటూ ప్లాట్ ఫారం దాట్తుంటే చల్లగాలి తగిల్న చంద్రశేఖరానికి మనశ్చికిత్సశాల నుండి విముక్తమవుతున్న అభాగ్యుడి స్థితి క్షణికంగా స్ఫురించింది.

“అమ్మ! ప్రాణం లేచొచ్చినట్టయింది! ఎంత చల్లనిగాలి కొడ్తున్నదీ!” అన్నాడు చంద్రశేఖరం వెర్రి ఆవేశంతో వొళ్లు విరుచుకుంటూ.

“ఈ సామాన్లు నా అలివి కావటం లేదు. కొంచెం వీటి విషయం చూడండి” అంది నిస్పృహతో పిల్లలిద్దర్తో చంద్రశేఖరం పక్కనే మూల వొదిగి కూచున్న రాజేశ్వరి.

“సామాన్లా? ఏ సామాన్లు? ఏమిటి – సరేలే, యీ సామాన్లు కూడా పరమ సమస్యయి కూచున్నై? నిమిషంలో సర్దేస్తానుండు” అన్నాడు చంద్రశేఖరం పరాకు నుండి వాస్తవానికొస్తూ.

కొంచెం వాట్ని మన వూరు సురక్షితంగా చేరేట్టు సర్దండి మీకు పుణ్యం వుంటుంది” అంది రాజేశ్వరి సన్నగా.

తను పరాకు మనిషని తన భార్య అనుమానిస్తున్నదని తోచిన చంద్రశేఖరం ఆప్యాయంగా రాజేశ్వరిని ఓ క్షణం చూసి మనసులో చిరునవ్వు నవ్వుకున్నాడు.

“సురక్షితమేమిటి స్వరక్షణగా భావించి మరీ సర్దుతాను. సరేనా?” అంటూ తన భార్యను సంతృప్తి పెట్టేట్టుగా సామాన్లు సర్ది వెంటనే కిటికీ దగ్గర కూచుని రైలు గమనాన్ననుభవిస్తూ దూర దూరంగా జరిగి పోతున్న పట్నం దీపాల కళ్ల చూశాడు చంద్రశేఖరం.

చంద్రశేఖరం వాలకం గమనించి రాజేశ్వరి మనసులో ఏమనుకున్నదో పిల్లలిద్దరూ చంద్రశేఖరం పక్కనే కూచుని రైలు బండి వేగాన్ని వెర్రి ఆనందంతో చూస్తుంటానికి సంతృప్తిపడి పెట్టెలో ప్రయాణీకుల్ని ఓసారి కలియచూసి చంద్రశేఖరం తెచ్చిన దిన పత్రికను తెరిచి చూస్తూ తమ ఊరును గురించి వూహలు చేసుకుంటూ ఆలోచనలో పడి పోయింది.

ఎలక్ట్రీ దీపాల వెలుగుల్లో నల్లగా దూరమై పోతున్న పట్నాకృతిని చూశాడు చంద్రశేఖరం. ఆ గోపురాలు, భవనాల శోభ, ఒకప్పుడు తను ఎంతగా ఆనందించినా యివ్వాళ ఆ గోపురాలు తనకు అచైతన్యంగానూ, నిర్జీవంగానూ కనిపిస్తున్నందుకు కొంచెంగానయినా విచారించక పోగా ఆ వాతావరణాన్నుంచి కొన్నాళ్లు తను తప్పించుకొంటున్నందుకు ఆత్మ సంతృప్తిపడ్డాడు చంద్రశేఖరం.

తన మనస్సు పాడయిందా? తన శరీర తత్వ రీత్యా వుంటూ వచ్చిన తన మనస్సు అనారోగ్యంగా మార్పు చెందిందా? అని ప్రశ్నించుకున్నాడు పట్నం దృశ్యానికి విరక్తి చెందిన చంద్రశేఖరం.

తన మనస్సు పాడవుతే యీ రైలు ప్రయాణం, రైలు వేగం, యీ చల్లని వెన్నెల రాత్రీ తనకెందుకు ఆహ్లాదాన్నిస్తున్నయ్? తనలో ఏదో తుఫాను రేగుతున్నదనుకున్నాడు చంద్రశేఖరం.

కొండలూ, గుట్టలూ, చెట్లూ, చామలూ, గ్రామాలూ, గ్రామ భూములూ గొలుసుకట్టుగా గుంపులు గుంపులుగా దాటిపోతున్నాయి నిర్భయంగా పురోగమిస్తున్న రైలు వేగంతో.

పెట్లోలోని ప్రయాణీకులు ముఠాలు ముఠాలుగా పత్రికా వార్తల్ను గురించీ, సినిమాల్ని గురించి, కరువు కాటకాల్ను గురించీ, కాంగ్రెసును గురించీ ప్రమాదరహితంగా మాట్లాడుకుంటున్నారు.

"రైలు బొగ్గు రవ్వలన్నీ మీ కళ్ల మీదికే వస్తున్నట్టున్నయి. తల కాస్త యిటు తిప్పండి" అంది రాజేశ్వరి సన్నగా చంద్రశేఖరానికి వినబడేట్టు.

"ఉపాయంగానే కళ్లు కాపాడుకుంటున్నాలే - అన్నట్టు పత్రికా ప్రపంచంలో వున్నావనుకున్నానే - కాఫీ కావాలా?" అని అడిగాడు చంద్రశేఖరం ఓరగా తన కెల్లి చూస్తున్న రాజేశ్వరిని చూస్తూ.

"నాకేం అక్కర్లా కావాలంటే మీరు తాగండి. ఆలోచన్లకు యింకాస్త వేడెక్కిస్తుంది" అంది రాజేశ్వరి చటుక్కున చేతిలో ఉన్న పత్రిక మీదికి దృష్టి మళ్లిచ్చుకుంటూ.

"రైలు ప్రయాణం బాగుంది గదూ - యిదిగో యీ ప్రయాణం సందర్భంలో గట్టిగా మాటలు విసరబోకు, చల్లగా ప్రయాణం సాగిపోతున్నది" అన్నాడు చంద్రశేఖరం రాజేశ్వర్ని. సహం సంబరంతోనూ, సహం నిద్రమత్తుతోనూ కిటికీ దగ్గిరే కరుచుక్కూచున్న తన యిద్దరు పిల్లల్నీ సంతృప్తితో చూస్తూ. రైలు గూడూరు చేరకసరికే పెట్టెలో ప్రయాణీక జనం ఏ యిద్దరు ముగ్గురు మినహాగానో వొకరి మీదొకరు వొరుగుతూ చప్పగా నిద్రపొయ్యారు. కంట్లో బొగ్గు నుసి పడ్తున్నా రైలు వేగంలో వచ్చి పోతున్న వివిధ దృశ్యాలను వాచిపోయినట్టు చూసి నిద్రావేశంతో చంద్రశేఖరం యిద్దరు పిల్లలూ తమ ముఖాల్లో వింత భావాల్ని స్ఫురింపచేస్తూ నిశ్చింతగా నిద్రపొయ్యారు. పిల్లలకు అధికంగా చోటు పంచిన తన భార్య ట్రంకు పెట్టె మీదకు సగం ముడుచుకుని అనిశ్చలంగా నిద్రపోతున్నది. చంద్రశేఖరానికి నిద్ర పట్టలేదు.

దీర్ఘకాలంగా జైలు శిక్షననుభవిస్తున్న బందీకి క్షణికంగా స్వేచ్ఛ లభిస్తే ఆ స్వేచ్ఛానందంలో క్షణానికి పూర్వం తన దైనస్థితి ఆ బందీ సంపూర్ణంగా మరిచిపోగలడు. అయితే ఆ బందీతో చంద్రశేఖరాన్ని పోల్చటం సులభం కాదు. అందువల్లనే చంద్రశేఖరానికి నిద్ర పట్టలేదు.

ఇన్నేళ్లుగా పట్నంలో తన వుద్యోగాన్ని విశ్వాసపాత్రుడుగా నిర్వహిస్తున్న చంద్రశేఖరం యిటీవలగా తన వుద్యోగాన్ని మనసారా ద్వేషించ సాగాడు.

సినిమా స్లైడులు తీసి పెడ్తున్నట్టు తన అనుభవాలు చిన్న చిన్న దృశ్యాలుగా నిద్ర పట్టని చంద్రశేఖరం మనసుకు కనుపించసాగినై.

తన చదువును చూసి తనకు భార్యగా దక్కింది రాజేశ్వరి. రాజేశ్వరి అదృష్టవంతురాలని తన అత్తమామల తాలుకు పెద్దలంతా దివ్య దృష్టితో 'సర్వం సుఖినోభవంతు'గా సెలవిచ్చారు. అయినా తద్విరుద్ధంగా పెళ్లయిన నాలుగేళ్లపాటు నిరుద్యోగంతో దుర్భర దారిద్ర్యానికి నిశితంగా గురయినారు తమ నూతన దంపతులు. ఆ స్థితిలో తన చదువుగాని, తన దేశంగాని, తమని ఆదుకోనందుకు బాధతో కుమిలిపోయిన చంద్రశేఖరానికి పట్నంలో వుద్యోగం దొరకడం అభాగ్యుని నెత్తిన కనకవర్షం కురిపించినట్టుగా తోచింది. ఆనాడు యీ ఉద్యోగాన్ని తన భావి జీవితానికి శుభోదయంగా భావించి ఆహ్వానించటం చంద్రశేఖరం జ్ఞప్తికి తెచ్చుకున్నాడు.

'ధన్ ధనాధన్, ధన్ ధనాధన్' అంటూ తాళ యుక్తంగా ఓ వాగును దాటి ధుమధుమ లాడ్తూ అతివేగంగా ముందుకు సాగిపోతున్నది రైలుబండి.

ఒడుదుడుకులు లేకుండా సాగిపోతున్న వుద్యోగంతో పట్నవాసం సుఖంగా తోచిన చంద్రశేఖరంలో మార్పు కలగటం ప్రారంభించింది. ఆఫీసులో తను రోజూ సృష్టిస్తున్న ఫలితానికి సంతృప్తిపడుతూ తాత్కాలికానందాన్ని అనుభవిస్తున్న చంద్రశేఖరాన్ని మెల్లిమెల్లిగా అస్థిమిత ఛాయలు ఆవరించుకోటం మొదలుపెట్టినై. ఇద్దరు పిలల్తో కుటుంబం సంఖ్య పెరగడం రాజేశ్వరి ఆరోగ్యం క్షీణించడం తన కుటుంబంలో తిరిగి ఆర్థిక సంక్షోభం తల యెత్తింది. తన వుద్యగంలో తన శ్రమ ఫలితానికి అభివృద్ధిలేని లక్షణాలున్నట్టు సందేహించటం మొదలుపెట్టాడు చంద్రశేఖరం. ఇన్నాళ్లు అభిమానం పెంచుతున్న తన పనిని నిర్జీవోత్సాహంతో సత్కరించసాగాడు చంద్రశేఖరం. ఇహ కేవలం ఆర్థికావసరంతో మిగిలిన చంద్రశేఖరాన్ని అసంతృప్తి నిచ్చేతన ఆఫీసు పని నిర్దాక్షిణ్యంగా తినసాగింది.

ఔను – కొంతకాలం కిందట తనకున్న పరిమితావసరాలనన్నిట్నీ సంతృప్తి పెట్టిన యీ వుద్యోగం యివాళ తనకు పెరిగిన అవసరాల్ని హేయంగా పరిహసిస్తుంటం స్పష్టంగా చూశాడు చంద్రశేఖరం. ఇంక రోజూ ఆఫీసులో తను నిర్వహించవలసిన పనికి టేబుల్ ముందు కూచోవడమే తడవుగా తన ముందున్న తెల్ల కాగితాల మీద బొగ్గుతో బొమ్మగీసినట్టు వెనుక తను తన్ని తగలేసి దరిద్రదేవత తిరిగి తన ముక్తికి తలతో భయంకరంగా సాక్షాత్కరించసాగింది. ఈ భయంకర స్వరూపాన్ని సందర్శిస్తూనే తన ఆఫీసు పని నిర్వహించుకుంటున్న చంద్రశేఖరం పని మెరుగులో అభివృద్ధి పోగొట్టుకోసాగాడు.

తన దైన్యావస్థను ఎంతో కొంత తెలిసిన తన భార్య పొరుగువార్తో తన యీ వుద్యోగాన్ని గుర్తించి సగర్వంగా చెప్పుకోటం విన్న చంద్రశేఖరం తన భార్యకు జబ్బు ముదుర్తున్నదనుకున్నాడు.

వెనక నుంచి ఎవరో తోస్తున్నట్టు - ఓ మంచి రోజున వెళ్లి తన యజమాని నడిగాడు చంద్రశేఖరం. తన కుటుంబానికి ఆరోగ్యం కలిగించమని.

"అసంభవం" అన్నాడు తన యజమాని ఆ మాటంటానికి తయారై కూచున్నట్టు.

తల వొంచుకునే మాట్టాడ్తున్న యజమాని తనను సరిగా చూసి వుండడనే అనుమానంతో "తమరు నా స్థితిని గురించి కొంచెం వినాలని కోర్తున్నాను" అన్నాడు మళ్లీ చంద్రశేఖరం.

తలెత్తి తనకెల్లి నిదానంగా చూసి "చంద్రశేఖరం" అనన్నాడు యజమాని.

యజమానికి యింకొంచెం స్పష్టంగా కనిపించేందుకు చంద్రశేఖరం కొంచెం ముందుకువచ్చి ఔను నేనేనండీ" అన్నాడు.

''నువడిగిన విషయం యిప్పట్లో వీలుకాదు'' అన్నాడు యజమాని తడువుకోకుండా.

"మీ పని మీదే నేను పూర్తిగా ఆధారపడి వున్నానని మీకు తెలుసు. మీరు కాకుండా యింకొకరు నాకు సహాయం చేయలేరు" అన్నాడు తను రాచుకుపోతున్న గొంతుతో.

"ఇదిగో చంద్రశేఖరం యిటు చూడూ. యివాళ యీ మన వాతావరణమంతా అనారోగ్యంగా వుందని నీకు తెలుసుననుకుంటా" అన్నాడు యజమాని.

"నాకు అంతగా తెలియదండీ" అన్నాడు తన యజమానిని వింతగా చూస్తూ.

"అవును నువు తెలుసుకోలేవని నాకూ తెలుసు. విషయం ఏమిటంటే ప్రస్తుత వాతావరణాన్ని బట్టి ఎవరి ఆరోగ్యాలూ బాగుంటంలేదనే ప్రశ్నే లేదు. ఆ మాటకొస్తే నా ఆరోగ్యం అసలు బాగుండలేదు కనుక యిక నీ ఆరోగ్యం గురించి నన్ను ప్రశ్నించవనుకుంటా - యింక నువ్వు వెళ్ళవచ్చు" అన్నాడా యజమాని తిరిగి తల వొంచుకుంటూ.

తనతో పాటు అనారోగ్యంతో బాధపడ్తున్న తన యజమాని తనకేవిధంగా వుపయోగపడ్తాడనే సమస్యను కచ్చితంగా తేల్చుకోలేకపోయాడు చంద్రశేఖరం. ఎందుకంటే తన లాంటి అభాగ్య రోగిష్టులు యింకా అనేక ఆఫీసుల నిండా రోగిష్టి యజమానుల్తో మునిగి తేల్తున్నారని తెలుసుకున్నాడు చంద్రశేఖరం.

"ఎందుకు మీలో యింత చిరాకు ఎక్కువవుతున్నదీ?" అడిగింది ఓ రోజు తన భార్య.

"జరుగుతున్న విషయాన్ని నువంత తెలియనట్టు అడగడం నాకంత బాగుండలేదు'" అన్నాడు తను చిరాగ్గా.

"అదేమిటండీ అంత విచిత్రంగా మాట్టాడ్తారు. మీ మనస్సులో జరుగుతున్న విచిత్రాలు నాకెలా తెలుస్తయ్యీ? పోనీ ఏనాడన్నా మీరు నాతో మనసిచ్చి మాట్టాడ్తారు గనకనా!" అంది తన భార్య తనకు దొరికిన అవకాశాన్ని పురస్కరించుకుని.

"అయితే మనం అనుభవిస్తున్న దరిద్రావస్థను గురించి నీకు తెలియదనే అంటావా?" అన్నాడతను.

"బాగానే వుంది. దరిద్రం యివాళ మనకు కొత్తా ఏమిటి? ఎక్కువ తెమ్మని మిమ్మల్ని ప్రశ్నిస్తేగా మీరు బాధ పడవలసిందీ?" అంది తన భార్య.

"నువ్వు ప్రశ్నించకపోవటమే నన్ను దహిస్తున్నది. నువు నిశ్శబ్దంగా బాధననుభవిస్తూ నీరసిస్తుంటే నా అసమర్ధతను పొడుస్తున్నట్టే వుంది నాకు. నేను చేస్తున్న వుద్యోగం పరమ రోతగా వుంది నాకు. ఎన్నాళ్లు చేసినా ఎదుగూ బొదుగూ లేకుండటం పరమ సంకటంగా వుంది" అన్నాడు తను.

"అదేమిటండీ వింతగా మాట్టాడ్తున్నారు? యీ వుద్యోగం దొరికినాక మనమూ మానవ మాత్రులంగా జీవించ గలుగుతున్నామని ఎన్నిసార్లు మనం అనుకోలేదూ?" అంది తన భార్య తనకెల్లి అనుమానాశ్చర్యాల్తో చూస్తూ.

"ఔను. ఆ రోజుల్లో మనల్ని సుఖ పెట్టిన యీ వుద్యోగం యివాళ ఎందుకు సుఖ పెట్టడం లేదనే నేను ప్రశ్నించేది. మన కుటుంబం పెరగటంతో మనవసరాలు పెరగటం మనం చేసుకున్న పాపమా? మన కోర్కెల్నీ, మన ముఖ్యావసరాల్నీ, మన రోగాల్ని, నా బుద్ధిబలం, శరీర బలాన్ని కైంకర్యం చేసుకున్న యీ వుద్యోగం ఆదుకోకపోతే యింకెవరాదుకుంటారు. యీ బాధ నన్ను దహించకుండా ఎట్టా ఉంటుందో నువే చెప్పు" అన్నాడతను.

"ఔను మీ చదువుకూ, మీరు పడ్తున్న శ్రమకూ ప్రతిఫలం దక్కడం లేదని మీతో పాటు నేనూ లోపల్లోపల కుమిలిపోతున్నా. అందుకు మనల్ని ప్రాణంతో నిలబెడ్తున్న యీ వుద్యోగాన్ని ఎలా తిట్టి పోయమంటారో మీరే చెప్పండి? పోనీ యింకో ఉద్యోగం కోసం ప్రయత్నించి చూడండి" అంది తన భార్య నీరసంగా.

"ఇంకో వుద్యోగాల్లో వున్న నాలాంటి అభాగ్యుల్ని కొన్ని వందలమందిని నేనెరుగుదును" అన్నాడు.

"అటువంటప్పుడు మన కావేశాలెందుకులెండి. లోకం మనొక్కళ్లకే అన్యాయం చేయటం లేదుగా" అంది తన భార్య.

తోటి దరిద్రుల్ని చూసి నిరాశకు లొంగి తన భార్య తననా దృష్టితోనే చూస్తున్నదనుకున్న చంద్రశేఖరం తన ఒంటరితనానికి క్షణికంగా విచారించాడు. తను నిరుద్యోగంలో వున్నప్పుడే తన భార్య జబ్బు మనిషయిందని తనకు తెలుసు. అయితే యీనాటి వరకూ తన సహన గుణాన్ని పోగొట్టుకోని తన భార్యను చూసి చంద్రశేఖరం మనస్సు కొంత సంతృప్తి పడకపోలేదు.

రైలు నెల్లూరు దాటింది. చంద్రశేఖరం పెద్దపిల్ల తన రెండు కాళ్లను చిన్నపిల్ల నెత్తిన పెట్టేసరికి 'కుయ్యో' మన్న చిన్నపిల్ల తల్లి వొళ్లో పొదుక్కుని ఏడుపు మొహంతో అట్టాగే నిద్రపోయింది కొంచెం సేపట్లో. రాజేశ్వరి తన బరువైన నిద్రకళ్లతో ఓసారి సామాన్లనూ, చంద్రశేఖరాన్ని చూసి చీర చెరుగు తల మీదకు లాక్కుని అట్టాగే అనిశ్చలంగా పడుకుంది. నెల్లూర్లో తన మనుమడ్తో పెట్టెలో కెక్కిన ఓ ముసలి రైతు దగ్గుతూ కూచుంటానికి చోటు లేక కాసేపు పాకీ దొడ్డి తలుపుకానుకుని నిలబడి, మెల్లిగా పక్కనే కింద కూచుని దీర్ఘ నిద్రలో తూలెట్లాడ్తున్న ఓ కోమటి తన మనుమడ్తో ఒదిగి కూచుని, యింకొంచెం సేపటికి అట్టాగే కోమటి మీదకు వొరిగి నిద్రపోయాడు తన మనుమడ్తో సహా.

నిద్రామయంలో మునిగిన రైలు పెట్టె వాతావరణపు ప్రభావం చంద్రశేఖరం మీద పని చేయలేకపోయింది. స్వేచ్ఛ మహా ప్రసాదంగా తోచింది.

తను యీ సెలవులో తన దేశం, తన ఊరు, తన వాతావరణంలో ఎంత ఆనందంగా నన్నాకాలం గడపవచ్చుననుకున్న చంద్రశేఖరానికి వెంటనే తను సెలవు అడగటం కోసం తన యజమాని ఎదుటు నుంచున్న దృశ్యం ప్రత్యక్షమయింది.

తను గదిలోకి రాగానే తల వొంచుకు కూచున్న యజమాని ప్రత్యక్షమవుతాడని అంచనా వేసుకోలేదు చంద్రశేఖరం.

"హుఁ" అని గొంతు సవరించుకున్నాడు తన యజమాని దృష్టి నాకర్షించాలని.

అర్ధనిమీలిత నేత్రాల్తో క్షణికంగా సహం తలెత్తి తన కెల్లి చూసి మళ్లీ వెంటనే తను చదువుకుంటున్న విషయంలోకి దిగిపొయ్యాడు యజమాని.

యజమాని బహుశ తను శెలవు అడగడానికి వచ్చాడని పసికట్టి వుండవచ్చునే అనుమానం పీకింది చంద్రశేఖరాన్ని.

"చాలా అవసరమైన పనిలో వున్నట్టున్నారు" అన్నాడతను రాచుకుపోతున్న గొంతుతో.

తన యజమానితో ఎప్పుడూ మాట్లాడకపోయినా అంతకు వొక్క సెకండు ముందుగా తన గొంతు పొడార్చుకుపోవటం చంద్రశేఖరానికి ఏమాత్రం యిష్టం లేదు.

"ఆఁ" అని ఛటుక్కున తలెత్తి ఆపాదమస్తకం కొలుస్తున్నట్టుగా తనకెల్లి చూసాడు యజమాని.

తనను యిన్నేళ్లు తన ఆపీసు వుద్యోగిగా ఎరిగిన యజమాని మధ్య మధ్య తనను కొత్తగా చూట్టం బొత్తిగా చంద్రశేఖరానికి వికారం కలిగించింది.

"తమతో కొంచెం పని వుండి వొచ్చాను" అన్నాడు తను.

"ఆఁ" పనా? ఏం పని?" అన్నాడు యజమాని గొంతులో ఏవో ధ్వనులు పుడ్తున్నట్టు. తను అడగపొయ్యే విషయానికి విరుద్ధ ధ్వనులు ప్రారంభమైనయ్యనే అస్పష్ట భావంతో కొంచెం తికమక పడ్డాడు చంద్రశేఖరం.

"తమరు కొంచెం అవకాశమిస్తే సెలవు అడగటానికి వచ్చాను" అన్నాడతను తటపటలు వికటిస్తయ్యని.

"ఆఁ! సెలవా! ఎన్నాళ్లు?" అన్నాడు యజమాని సహం వొరిగున్న మనిషి పూర్తిగా లేచి కూచుంటూ.

ఆరోగ్య విషయాలు తను ప్రస్తావించినప్పుడు కూడా యజమాని యింత ఆశ్చర్యార్థకంగా అయి పోనవసరం లేదనుకున్నాడు చంద్రశేఖరం.

"పదిహేనో, యిరవై రోజుల్లోనో తిరిగి పనిలో ప్రవేశిస్తాను" అన్నాడు తను వెంటనే విషయానికి రావటం మంచిదని.

ఒక్క క్షణం వొంచుకున్న తలను పైకెత్తి "ఇదిగో చంద్రశేఖరం నువంటే నాకు మంచి అభిప్రాయం వుంది. నువు పదిరోజుల కన్న శెలవు తీసుకోటం నాకిష్టం లేదు" అన్నాడు యజమాని నిదానంగా.

ఉన్న సెలవునంతా మిమ్మల్ని యిబ్బంది పెట్టేట్టుగా వొక్కసారిగా వాడుకోటం నా ఉద్దేశ్యం కాదుకానీండి, నా ముఖ్య బంధువొకరికి ఆరోగ్యం ప్రమాదంగా వుండి, ఆయన్తో పరిష్కరించుకోవల్సిన సమస్యలనేకం వుంటం వలన కాలవ్యవధి పడ్తుందేమోననే ఉద్దేశ్యంతో యిన్నాళ్ల సెలవడుగుతున్నా. వెంకటరత్నంగారు ఫరవాలేదు నా పని చూస్తూ వుంటానని మాట యిచ్చారు కూడా" అన్నాడు తను తడువుకోకుండా బొంకుతూ.

"ఏమిటా వెంకటరత్నం చూసేది? వొంకర్టింకరగా – అయినా చంద్రశేఖరం నువు సెలవు తొందర్లోనే ముగించుకు రావాలనే మళ్లీ నేను చెప్పేది. తరవాత నీ యిష్టం. సరే నువ్వు వెళ్లవచ్చు" అన్నాడు యజమాని తల వొంచేసుకుని చదువులోకి దిగిపోతూ.

అసంపూర్ణాభినయంతో తెర జారినట్టు పై స్థాయిలో తనకు దక్కిన సెలవుకు అంతగానే సంతృప్తి పడ్డాడు చంద్రశేఖరం.

రాజేశ్వరి తనని తట్టి లేపేదాకా తనకు ఎప్పుడు నిద్రపట్టిందీ వూహించలేకపోయిన చంద్రశేఖరం నిశ్చింతమైన తేట మొహంతో తన చుట్టూ వున్న అద్భుత వాతావరణాన్ని వింతగా చూశాడు. అప్పుడే అరుణోదయమవుతున్నది.

ఆ వాతావరణంలో ముందుగా చంద్రశేఖరం ఆఘ్రాణించింది అరుణకాంతుల్లో అల్లల్లాడుతున్న పచ్చపైరు మాగాణి భూముల వాసన. చల్లగా పార్తున్న పంట కాలవలు, పిల్ల కాలవలు, అక్కడక్కడ శ్రామిక రైతు జనం, గ్రామ దృశ్యాలు తనలో నిద్రాణంగా వున్న జీవశక్తుల్ని తట్టి లేపుతున్నట్టనిపించింది చంద్రశేఖరానికి. తన నికృష్ట శ్రమ జీవితం లోంచి ప్రతిబింబిస్తున్న పట్నవాసపు యంత్ర జీవితాన్నుండి బయటపడిన చంద్రశేఖరం హృదయానికి తన స్వదేశ ప్రాంతం సజీవంగానూ, ఆత్మీయంగానూ కనుపించింది.

తనను యింతగా ముగ్ధుణ్ణి చేస్తున్న తన స్వదేశ ప్రాంతం తనను పరదేశానికి ఎందుకు తరిమేసిందోనని బాధ ఒక్కసారి చంద్రశేఖరాన్ని వూపేసింది. అయితే యిందుకు బాధ్యులు అచైతన్యులూ, అభాగ్యులయిన తన ప్రాంతీయులేగాని, సౌందర్యంగానూ, సారవంతంగానూ కనుపించే తన జాతి ప్రాంతం కాదని వెంటనే గ్రహించాడు చంద్రశేఖరం. అయినా యీ గడ్డకు తనూ, తన కుటుంబం వారసులనే మనో నిశ్చయానికొచ్చాడు చంద్రశేఖరం.

"మన ప్రాంతం చూసి ఎన్ని శతాబ్దాలయినట్టుందండీ!" అంది తన భార్య తేటయిన చిరునవ్వుతో.

"ఈ ప్రాంతం మనది గనుకనే యింత సంతృప్తినిస్తున్నది మనకు" అన్నాడు చంద్రశేఖరం తన భార్యను సంతృప్తితో చూస్తూ.

"మనం దేశం గాని దేశంలో వుండిపోటంలో మన ప్రాంతం యింత ప్రత్యేకించి కనుపిస్తున్నది. ఏమయినా మీకు మీ యజమాన్లు సెలవిచ్చారు అంతేచాలు. మన వాళ్లందర్తో కొన్నాళ్లన్నా హాయిగా వుండొచ్చు" అంది రాజేశ్వరి చంద్రశేఖరం కెల్లి ఆప్యాయంగా చూస్తూ.

"అమ్మా! నాన్నా! చూడు.. చూడు... ఎంతమంది మనుషులు అక్కడ! అబ్బబ్బ!!" అని ఆవేశంతో చప్పట్లు చరుస్తూ అరిచారు కిటికీ దగ్గిరకు చేరిన చంద్రశేఖరం యిద్దరు పిల్లలు.

కుతూహలంతో కిటికీ లోంచి తొంగి చూసిన చంద్రశేఖరానికి సమీపిస్తున్న స్టేషన్ ప్లాట్ ఫారం మీద కిక్కిరిసి కోలాహలం చేస్తున్న జనసముద్రం కనుపించింది.

ఆ జనసమూహం తమను సమీపిస్తున్న రైలుబండి నుద్దేసిస్తూ ఆవేశంతో ఒకటే అరుస్తున్నారు. వందలకొద్ది ఆ జనం చేతుల్లో ఉన్న పొడుగాటి కర్రలకు ఎర్రటి అక్షరాలున్న అట్టలున్నయి.

ఎవరో మంత్రిగారికి స్వాగతం జరుగుతున్నదని భ్రమపడ్డ చంద్రశేఖరం వెంటనే తన అభిప్రాయాన్ని మార్చుకున్నాడు.

రైలు ప్లాట్ ఫారం దగ్గిరకు చేరిందోలేదో చుట్టుముడ్తున్న ఆ జన ప్రవాహం గొంతులు పగిల్నయి 'మాకు ఆంధ్ర రాష్ట్రం కావాలి. విజయవాడ మా ముఖ్యనగరం' అన్న అరుపుల్తో బ్రహ్మాండాన్ని పెగల్దీస్తున్నట్టు.

దారిద్ర్యాన్నీ, బానిసత్వాన్నీ మధించగా పుట్టిన హాలాహలం' యిదనుకున్నాడు చంద్రశేఖరం.

గలగలమంటూ ఎముకలల్లే సన్నగా వున్న వంకరటోపీల శాంతి రక్షక దళాలు తమ రక్షక తుపాకుల్తో రైల్లోంచి లైనుగా వచ్చి ఆ జన సముద్రం పక్కన అనిశ్చలంగా నుంచున్నారు.

"మాకు ఆంధ్ర రాష్ట్రం కావాలి" అనరిచింది జన సముద్రం తన ప్రళయ ధ్వని కెరటాల్ని విసుర్తూ.

తమకు స్థానం లేని ఆ జన సముద్రంలో సన్నటి శాంతి రక్షకులు అస్పష్టంగా కనుపిస్తున్నారు.

"మనం పరాకున గమనించలేదు. మన వూరు వొచ్చేశాం. దిగిపోదాం రండి" అన్నాడు చంద్రశేఖరం తన కుటుంబాన్ని చూస్తూ.